# H. నరసింహం ఆత్మహత్య



215

డా॥ వి. చంద్రశేఖరరావు



కోఠీ ఉమెన్స్ కాలేజీ వెనుకన, ఇరుకిరుకుగా ఉన్న ఒక గల్లీలో నేను పుట్టాను. సెటిలర్, అవుట్‌సైడర్, ఆంధ్రా పోరీ వగైరా లేబుల్స్ నాకంటించినా, నేను హైదరాబాదీనే. కోస్తా జిల్లాల మదం, పొగరు, ఆధిపత్య భావజాలం వగైరాల మాట అటుంచి, నా పాతికేళ్ళ జీవితం, సారం హైదరాబాదే. నేను ఇక్కడే పెరిగాను. ఇక్కడే చదువుకున్నాను. మా నాన్నకు కూడా గుర్తులేదు, ఎన్నేళ్ళక్రితం ఇక్కడికి వచ్చాడో?

హైదరాబాద్ రోడ్లపైనే నా బాల్యమంతా గడిచిపోయింది. గుర్తు పట్టలేనంతగా ఆ రోడ్ల రూపం మారినా, అపార్ట్‌మెంట్లు, రంగు దీపాలు, పెద్దపెద్ద మాల్స్, అయినా ఆ రోడ్లపై పాదం పెట్టగానే ఒక గాఢమైన పరిమళం, నన్ను ఇప్పటికీ చుట్టుముట్టుతుంది. సజీవమైన భాష, ఆత్మీయమైన పలకరింపు, ఎరుపురంగు మెహందీలు, గాలి పటాలు, పురాతనమైన ఆత్మలకు సరికొత్త అలంకరణలు, రోడ్లను చూడగానే, జ్ఞాపకాల ప్రదర్శన నన్ను వివశురాల్ని చేస్తుంది. యాకుబ్ పురా, ఉస్మాన్‌గంజ్, నయాపూల్, కింగ్‌కోటీ, సుల్తాన్‌బజార్, నాంపల్లి, మలక్‌పేట... పేర్లు అవే అయినా, వాటి పూర్వ రూపం ఇప్పుడు లేదు. ఆత్మలు ఖాళీ చేసిపోయిన ప్రాసాదాల్లా. మేమూ సిటీని వదిలి అవుట్ స్కర్ట్‌కి వచ్చేశాము. ఖరీదైన షాపులు, మాల్స్, హోటళ్ళు, బ్యాంక్‌లు, కలల బేహారులకు మా రోడ్లని ఇచ్చేశాము. పాతికేళ్ళనాటి నిసర్గ సౌందర్యం, మెలాంకొలీ, మనుషుల వాసన ఇప్పుడు లేదు. ఇప్పుడీ బజార్లలో నడవలేనంత రద్దీ. ఎప్పుడైనా సెలవురోజున, నరసింహంతో కలసి ఈ రోడ్లపై నడిచేదాన్ని. నాలాగే ఈ రోడ్ల స్పర్శ కోసం వచ్చిన వాళ్ళతో రోడ్డు సముద్రంలా ప్రత్యక్షమయ్యేది. మేమిద్దరం, రోడ్లపై ఈదులాడి, అలిసిపోయి వడలిపోయి ఇళ్ళకు చేరతాము. ఒక్కోసారి

షాపింగ్ నెపంతో అమ్మతోటి అబిడ్స్ అంతా తిరుగుతాను. పాత పుస్తకాల సాకుతో ఆదివారాలు తిలక్‌రోడ్డులో గడుపుతాను. అక్కడే తమ్ముడు తన గర్ల్‌ఫ్రెండ్‌ని పరిచయం చేశాడు. ఆ అమ్మాయి, చార్మినార్ వెనుకనున్న గల్లీలో ఉండేదాన్నని చెప్పినప్పుడు, నాలో గొప్ప ఉద్వేగం. ఆ అమ్మాయి చేతుల్ని నా అరచేతుల మధ్య ఉంచుకొని, మృదువుగా నిమురుతూ, చార్మినార్‌ను నా రెండు బాహువుల మధ్య కౌగలించుకొన్న అనుభూతిని పొందుతూ, ఆ అమ్మాయి రంజాన్ మాసపు కథల్ని చెబుతుంటే, రెప్పవేయకుండా అట్లాగే వింటూ, చూస్తూ. నా భాష ఉర్దూ యాసని, ఇరానీ టీ ఘుమ ఘుమల్ని నింపుకొన్నట్లుగా ఉంటుంది. నేను మా నాన్న పుట్టిన వూరు కూచిపూడి వెళ్ళినప్పుడు మా బంధువులంతా, నా భాషను చూసి నవ్వడం నాకింకా గుర్తే.

ఎర్లీ టీన్స్‌లో గోల్కొండ నా ఎడ్వెంచర్ స్పాట్. ఫలక్‌నామా నా రహస్య డేటింగ్ ప్లేస్ (నరసింహంతో). ఆ రోజుల్లో ప్రేమికులకు కొన్ని ప్రత్యేక ప్రదేశాలు ఉండేవి. ఇందిరాపార్కు, టాంక్‌బండ్, బిర్లా మందిర్ (ముఖ్యంగా మెట్లపైన) గండిపేట చెరువు. యూనివర్సిటీ లోపలి రోడ్లు కూడా ప్రేమలతలు అల్లుకుపోడానికి అనువుగా ఉండేవి. ఇప్పట్లా కాకుండా, ఆ రోజుల్లో సిటీలో వాన గొప్ప రొమాం టిక్‌గా ఉండేది. రోడ్లు, మర్యాదపూర్వకమైన ప్రదేశాల్లా ఉండేవి (ఇప్పుడీ రోడ్లు కార్ల వరదతో, క్రిమినల్స్‌తో నిండిపోయాయి). ఎర్ర రంగు డబుల్‌డెక్కర్ బస్సులో కూర్చుని పగటి కలలు కనడం నా హాబీ. మా యింటి ఎదురుగానే నరసింహం ఇల్లు ఉండేది. వాళ్ళది డాబా యిల్లు. పిట్టగోడ, నిచ్చెన సాయంతో మిద్దెపైన సాయంకాలాలు గడిపేవాళ్లం. అప్పట్లో బ్రూస్‌లీ మా హీరో. 'బోనియమ్', 'అబ్బా' మా ఇన్స్పిరేషన్. వేడి వేడి టీ, గజల్ పాటలు, పుల్లారెడ్డి స్వీట్సు, సంగీత్‌లో ఇంగ్లీషు సినిమాలు, మాకు ప్రియమైన విషయాలు. గాలిపటాలు,





మా జీవితంలో ముఖ్యమైన డిస్కవరీ. నరసింహం వాళ్ళ అక్క నా దృష్టిలో గొప్ప సౌందర్యమూర్తి. లంబాడా స్త్రీలలో ఉండే మైదానాల సౌందర్యం తనలో ఉంది. వెడల్పాటి కళ్ళు, సముద్రంలా ప్రవహించే జుట్టు, దువ్వెనతో ఆ జుట్టును సాపు చెయ్యటం, నాకూ, నరసింహానికి ఇష్టమైన పాస్ టైమ్. ఆమె పేరు కాంత. ఆమె గుండెలు నన్ను సమ్మో హితం చేసేవి. పర్వతాలు, నదులు, వెన్నెల, పుప్పొడి కలగలిసినట్లు ఉండే ఆమె గుండెలు నాలో అసూయను కలిగించేవి. ఆమె స్నానం చేసే టప్పుడు, వీపు రుద్దే నెపంతో ఆమె స్థనాల్ని ముట్టుకునేదాన్ని. ఆమెను పెళ్ళి చేసుకోవటం కోసం, ఏ రాజకుమారుడో వస్తాడనుకునే దాన్ని. కనీసం అమెరికా సంబంధం (కట్నం లేకుండా). కానీ కాంత ఒకరోజు అదృశ్యమైపోయింది. చచ్చిపోయింది, అని చెప్పేవాడు వాళ్ళ నాన్న. నరసింహాన్ని ఆ మాట అడిగితే ముఖం మాడ్చుకునేవాడు. మౌనం గా మారిపొయ్యేవాడు. ఆమె గుర్తుకొచ్చినప్పుడు, నాకు నా చిన్ననాటి హైదరాబాద్ బజార్లు గుర్తుకొచ్చేవి.

నరసింహం ఇంట్లో జరిగే విందులు నాకెంతో యిష్టం. నర సింహంతో కలిసి, ఒక ఆదివారం తాగిన (వాళ్ళ పల్లెటూరులో) వెచ్చటి కల్లు, ఇప్పటికీ నాకో థ్రిల్. దుప్పి మాంసాన్ని నరసింహంతో పాటు రుచి చూశాను. నరసింహం కాస్త మొరటుగా ఉంటాడు. ఏకవచనం, బహు వచనంలాంటి భాషా నియమాలు పట్టించుకోడు. మా నాన్నను 'నువ్వు' అంటాడు. నన్ను ఇష్టంతో 'ఒసే' అంటాడు. నరసింహంతో రొమాన్సు ఘాటుగా ఉంటుంది. మృదువుగా ఉండటము, లలిత లలితంగా ఉండటము అతనికి తెలియవు. అతను, ముద్దు పెట్టిన తరువాత, రెండు రోజులపాటు పెదాలు మండుతూనే ఉంటాయి.

నరసింహం పెదనాన్న రేతీఫీల్డ్‌లో ఉండేవాడు. ఇరుకైన రోడ్డుపై ఆ గేదెల్ని కట్టివేసేవాడు. అదో మనోహరమైన దృశ్యం. నల్లని పర్వతాల్లా మెరిసిపోతుండేవా గేదెలు. వాటిని కడిగే పని, నాకూ,

నరసింహంకి పడేది. గేదెల చర్మపు స్పర్శ నాకు అద్భుతంగా ఉండేది. వాటిని ఎండుగడ్డితో రుద్దుతుంటే, గొప్ప తృప్తితో అవి మూలిగేవి. ఆత్మీయమైన నేస్తాల్లా అవి, మమ్మల్ని నాకేవి. నీళ్ళు కలవని పాలలో బెల్లం, మిరియాలు వేసి ఇచ్చేది వాళ్ళమ్మ. ఇప్పుడా గేదెలు లేవు. పాలవ్యాపారం లేదు. నరసింహం పెదనాన్న మాంసాన్ని టిన్డ్‌ఫుడ్స్‌గా ఎక్స్‌పోర్ట్ చేసే వ్యాపారాన్ని చేస్తున్నాడు.

హ్యూమన్ లాండ్‌స్కేప్‌లా ఉండే హైదరాబాద్‌లో నాకు నచ్చేవి, రోడ్లు (నా చిన్ననాటివి), రెండోది నరసింహంతో స్నేహం, రొమాన్సు. (తీవ్రంగా యుద్ధంలా ఉండే అతనితో లవ్-మేకింగ్). 2010 లోనో 2011లోనో మేము పెళ్ళి చేసుకుందాం అనుకున్నాము. (నరసింహంకు ఉద్యోగం వచ్చినాక) రోడ్ల మధ్యన (నరసింహం పెదనాన ఇంటి ముందర) షామియానా వేసి, రోడ్డు సాక్షిగా పెళ్ళి చేసుకోవాలని నా కోరిక.

* * *

నా ఇరవై మూడవ పుట్టినరోజున, నరసింహం ఉరిపోసుకొని చచ్చిపోయాడు. నవంబర్ 11, ఉదయం మంచు దట్టంగా ఉన్న ఆరు గంటల సమయంలో, మా అపార్టుమెంటు (సెటిలర్స్ ఎక్కువగా ఉండే) గేటుకు వేళాడుతూ కనిపించేడు.

ముందు అతని కాళ్ళు కనబడ్డాయి. ఏ ఆధారం లేకుండా, ఆకాశం నుండి వేళాడుతూ. పొద్దున్నే, అమ్మతో కలిసి గుడికి వెళుతూ, ముందు ఆ ఒంటరి కాళ్ళనే చూశాను. భయంతో దగ్గరకు వెళ్ళాను. గళ్ళ చొక్కా, నీలిరంగు పాంటు, రాత్రి పన్నెండు గంటలవేళ నా గదికి వచ్చి, బర్త్‌డే విషెస్ చెప్పినప్పటి డ్రస్ అది. భయంతో కంపించిపోయాను. పెనుకేక వేశాను. గుండెలు అలిసిపోయే కేక. 'నరసింహా', 'నరసింహా' ఏడుస్తూ, అరుస్తూ, గుండెలు బాదుకుంటూ, చాలాసేపటిదాకా అదంతా కలలోని దృశ్యమే అనుకుంటున్నాను.





ఎంతసేపు ఏడ్చేనో గుర్తులేదు. తేరుకునే లోపల అపార్టుమెంటులోని జనం అక్కడ మూగారు. ఏడ్చుకుంటూ, గుండెలు బాదుకుంటూ నరసింహం తల్లి వచ్చింది. ఎర్రబడ్డ కళ్ళతో సర్వం కోల్పోయినవాడిలా వాళ్ళ నాన్న, పెద్దనాన్న, పెద్దమ్మ, తమ్ముళ్ళు అందరూ వచ్చారు.

ఎత్తైన ఇనుపగేటుకు వేళ్ళాడుతూ, నాలుక బయటకు వచ్చి, కళ్ళు ముందుకు పొడుచుకువచ్చి, మెడచుట్టూ ఉబ్బిపోయి, భయం గొలిపేలా ఉందా దృశ్యం. ముందు మా నాన్నే పూనుకొని తాడును కోసి, శవాన్ని కిందకు దింపాలని చూశాడు. నరసింహం తాలూకు బంధువులు వారించారు. ఎనిమిదిన్నరకు, యాభై మంది కుర్ర వాళ్ళు యూనివర్సిటీ స్టూడెంట్సు వచ్చారు. ఎక్కువమంది నరసింహం కాలేజీ రోజులనాటి స్నేహితులు. ఆ ప్రాంతపు కౌన్సిలర్, కొద్దిమంది అనుచరులతో అక్కడికి వచ్చాడు. అపార్టుమెంటుకు ఎదురుగా రోడ్డు పై వందలుగా జనం మూగారు. వాళ్ళలో దుఃఖం, ఏదో తెలియని ఆవేశం. శవాన్ని కిందకు దించారు. నరసింహం జేబులో సూసైడ్ నోటు. 'తెలంగాణా రాష్ట్రం రాదనే వేదనతో' అంటూ. ఒక్కసారిగా అక్కడ నినాదాలు మారుమోగాయి.

నాన్న నావైపు చూస్తూ సైగ చేశాడు, అమ్మను తీసుకొని లోపలికి వెళ్ళమని. ఆయన చెప్పే మాటలేమీ నాకు వినబడటం లేదు. నరసింహం తల్లి, పెద్దమ్మ అక్కలు పెద్దగా ఏడుస్తున్నారు. నేలపై కూలబడి పెద్దపెద్దగా ఏడుస్తున్నారు. నరసింహం తండ్రి శవం పక్కనే కూర్చున్నాడు. ఉండీ ఉండీ, ఒక్కసారిగా 'నరసింహా' అంటూ అరిచాడు. పెద్దగా ఏడ వడం మొదలుపెట్టాడు. నరసింహం తండ్రి ఏడుపు గుండెల్ని పిసికినట్లనిపించింది.

తొమ్మిది గంటలకు అపార్ట్‌మెంట్‌లో ఉన్నవాళ్ళంతా, ఒక్కొక్కళ్ళే లోపలికి వెళ్ళిపోయారు. నాన్న, నేను, అమ్మ మిగిలిపోయాము. అమ్మ నరసింహంవాళ్ళ అమ్మను ఓదారుస్తూ. పోలీసులు వచ్చారు.

గేటు బయట ఉన్న కుర్రవాళ్ళలో కలకలం మొదలైంది. ఒక్కసారిగా వాళ్ళ మధ్యలోంచి 'నరసింహం అమర్ హై' అంటూ నినాదం వినబడింది. వెంటనే 'ఆంధ్రాస్ గో బ్యాక్' అంటూ ఒక కుర్రవాడు అరిచాడు. క్షణం వ్యవధి తరువాత, ఆ నినాదం ఊపందుకుంది. 'గో బ్యాక్', 'గో బ్యాక్' అంటూ అరిచారు. కొద్దిమంది పెద్దలు వాళ్ళను ఆగమంటూ సైగ జేశారు. నన్ను పైకి లేపి, అక్కడనుంచి తీసుకెళ్ళారు, మా యింట్లోకి. ఇంట్లోకి వెళుతుంటే "వీడేమిటి? ఎక్కడా చోటు లేనట్లు, మన అపార్ట్‌మెంటు ముందర..." అంటూ మా పక్కింటి వీరయ్య అంకుల్ నాన్నతో అంటున్నాడు. నాన్న సమాధానం చెప్పకుండా ఇంట్లోకి నడిచాడు.

మా కాలనీలో, మూడు నెలల్లో ఇది మూడో ఆత్మహత్య. సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేసే దంపతులు, జీవితంలో ఉత్సాహం ఆవిరైపోయిందని, సూసైడ్ నోట్ రాసి చచ్చిపోయారు. పాయిజన్ తీసుకున్నారు. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదివే శాంత, మణికట్టు కోసుకొని చనిపోయింది. వాళ్ళు ముగ్గురూ ఆంధ్రా ప్రాంతపువాళ్ళు. (నరసింహం భాషలో సెటిలర్స్). మొదటి యిద్దరిదీ డిప్రెషన్. శాంతది లవ్ ఫెయిల్యూర్.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు పోలీసులు వచ్చారు. పంచనామా రాసుకున్నారు. అప్పటికి, ఉదయం వచ్చిన కుర్రవాళ్ళలో చాలామంది వెళ్ళిపోయారు.

అపార్ట్‌మెంటులో వింత నిశ్శబ్దం కనిపిస్తుంది. అందరూ అపార్ట్‌మెంట్ల లోపలే ఉండిపోయారు. నరసింహం బంధువులు, స్నేహితులూ ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. అందరి ముఖాల్లో ఆశ్చర్యం. నమ్మలేనితనం. ఆత్మహత్య గురించే అందరూ చర్చించుకుంటున్నారు. అదీ సెటిలర్స్ ఉన్న అపార్టుమెంటు ముందర ఎందుకు చేసుకున్నాడనేది వాళ్ళందరికి అంతుపట్టని విషయం.





నరసింహం సూసైడ్ నోటును నేను చూడలేదు. నలిగి పోయిన డైరీ కాగితం, పోలీసు ఇన్స్పెక్టరుకు ఇస్తుండగా చూశాను.

నరసింహం నెలరోజులుగా దుఃఖపు మూడ్‌లో ఉన్నాడు. బ్రతుకు దుర్భరంగా ఉందని చెప్పేవాడు. ఎక్కడా పిసరంత ఆశ లేదని అనేవాడు. వాళ్ళ అక్క గురించి పదేపదే దిగులు పడేవాడు. గేదెలను అమ్ముకొని, రెడీమేడ్ ఫుడ్స్ వ్యాపారం పెట్టి, నష్టాలు వచ్చి, ఇప్పుడు మాల్‌లో సేల్సుమేన్‌గా చేస్తున్న వాళ్ళ పెద్దనాన్న గురించి చెప్పేవాడు. ఇంకో పది నెలల్లో రిటైరయ్యే వాళ్ళ నాన్న గురించి దిగులుపడ్డాడు. ఉద్యోగం లేని, తన ఇరవై ఏడేళ్ళ వయసు గురించి చెప్పేవాడు. "మీ ఆంధ్రావాళ్ళ కున్నంత ఎంటర్‌ప్రైజింగ్‌తనం మాకు లేదు..." అన్నాడొకరోజు. అది మొదటిసారి, అతని నోట ఆంధ్రా వాళ్ళు అనే మాట వినడం. ఉలిక్కిపడ్డాను. కానీ పెద్దగా రియాక్టు కాలేదు నేను. నవ్వి ఊరుకున్నాను. బి.పి.ఓ.లో నా ఉద్యోగం గురించి ఎన్నో ఆరాలు తీసేవాడు. జీతం గురించి, కొలీగ్స్ గురించి ముఖ్యంగా మగ కొలీగ్స్ గురించి, మొదటి నెల జీతం వచ్చినప్పుడు, బైక్‌ను, ఒక మూలన రోడ్డు చివరన ఆపి, నన్ను దగ్గరకు తీసుకొని, ముద్దు పెట్టుకొని, ఆ ముద్దులో తీవ్రత లేదు. గాఢమైన, సముద్రం అల ఫెడేల్‌మని చుట్టుముట్టినట్లుండే నరసింహం మార్కు ముద్దు కాదది. పేలవమైన, బలహీనమైన ఒట్టి తడి. ఆ మాటే అతనితో అన్నాను. మాట్లాడలేదు అతను.

రంజాన్ నెలలో రాత్రిపూట చార్మినార్‌కు తీసుకెళ్ళమని అడిగాను. రాత్రిపూట మిరుమిట్లు గొలిపే వెలుగు మధ్య వంద లాదిగా జనం. వాళ్ళ మధ్యన, వరుసుకుంటూ నడవటం, నరసింహం లో ఏ థ్రిల్ లేదు. రోడ్ల పక్కనున్న పర్సులు, బ్యాగ్‌లు, రెడీమేడ్ వస్తువులు, వాటిచుట్టూ ఎగబడ్డ జనం, వాళ్ళవైపు దిగులుగా చూశాడు. నేను పెరల్స్ దండ కోసం షాపులోకి వెళుతుంటే, నన్ను

ముద్దాయిలా చూశాడు. "ఆర్ యు నాట్ ఎ షేమ్డ్" అన్నాడు తీవ్ర స్వరంతో. "ఆ గుంపుల మధ్యన మీ ఆంధ్రావాళ్ళు ఒక్కళ్ళయినా ఉన్నారేమో చూడు" అన్నాడు వేలు పెట్టి చూపిస్తూ. "సో..." అన్నాను నేను, మామూలుగానే. ఆ రాత్రంతా బిగుసుకుపోయి, ముఖం నల్లగా పెట్టుకొనే ఉన్నాడు. కలిసి హాలీమ్ తింటానికి కూడా నిరాకరించాడు. ఆ రాత్రి నేను, సరిగ్గా లెక్కపెట్టలేదుగానీ, కనీసం యాభైసార్లు, తను నిట్టూర్చటం, ఇప్పుడు స్పష్టంగా గుర్తుకొస్తుంది.

నరసింహం శవం హాస్పటల్ నుంచి వచ్చేవరకూ నేను వాళ్ళ ఇంట్లోనే ఉన్నాను. వాళ్ళమ్మ పక్కనే కూర్చున్నాను. ఎవరు? ఎవరు? అందరూ నా గురించి మాట్లాడుకోవడం నాకు అర్థమవుతుంది. శత్రు శిబిరానికి చెందిన వ్యక్తిలాగా నన్ను చూడటం నాకు తెలుస్తుంది. సాయంకాలం ఐదుకు నరసింహం శవం ఇంటికి వచ్చింది. వెళ్ళేట ప్పుడు పదిమందితో వెళ్ళిన శవం, సాయంత్రానికి వెయ్యిమందితో వచ్చింది.

వీధి పట్టనంత జనం. నాకు ఆశ్చర్యం, భయం వేసింది. హఠాత్తుగా నరసింహం ఒక పౌరాణికమూర్తి అయ్యాడు. అతని మరణం వీరమరణం అయ్యింది. కత్తితో తలను కోసుకొని, అమ్మ వారికి అర్పించిన చారిత్రక పురుషుని కథలా మారింది. H. శంకరం కొడుకు, P. కృష్ణవేణి లవర్, ఇప్పుడొక అవతార పురుషుడయ్యాడు. నాలో వింత జలదరింపు.

నరసింహం, నన్ను చాలాసార్లు ఓ.యు. కాంపస్‌కి తీసికెళ్ళే వాడు. నాతో గోడలపై నినాదాలు రాయించేవాడు. మీటింగ్‌లలో ముందు వరసల్లో కూర్చునేవాళ్ళం. ఆంధ్రావాళ్ళు వెళ్ళిపోతేగానీ తెలం గాణా బిడ్డలకు ఉద్యోగాల కొరత తీరదని, నాతో వాదించేవాడు. ఒకసారి, బొటనవేలు కోసుకొని, రక్తంతో ఒక కరపత్రంపై సంతకం పెట్టి వచ్చాడు.





తెలంగాణ ఉద్యమం ఉనికిని నేను గట్టిగా నమ్మాను. ఆ మాటే నరసింహంతో అన్నాను. రేపటి తెలంగాణ (రాష్ట్రం) ఎలా ఉంటుందంటే, అచ్చం మన ప్రేమలాగే- అన్నాను సీరియస్‌గా.

నరసింహం ఇంటి ముందు, టెంట్‌లో వందలాదిగా కుర్ర వాళ్ళు మూగారు. పాటలు పాడారు. ఎర్రటి కుంకుమను వీధంతా చల్లారు. నరసింహం శరీరంపై వందలాది పూలదండలు, బుట్టలకొద్దీ పూలు చల్లుతూ, ఆ సందడిలో నరసింహం ఇంటి సభ్యులు, నేను, అందరం అదృశ్యం అయ్యాము. నరసింహం శరీరం, ప్రజల సొత్తు అయ్యింది. పాటలు, నినాదాలు, వేలమంది గద్గద స్వరంతో, నరసింహం శరీరానికి వీడ్కోలు చెప్పారు.

మరుసటిరోజు నుంచి, చాలారోజులపాటు, నరసింహం గురించిన కొత్త చరిత్ర, జీవించటము మొదలుపెట్టింది. నాకు తెలిసిన నరసింహం, ఈ కొత్త చరిత్రలో లేడు. హైదరాబాద్‌లో రోడ్లపై నాతో కలిసి తిరిగిన నరసింహం లేడు. ఈ కొత్త నరసింహం అసలు జన సమూహాల మధ్యన సంచరించడు. ఆదర్శాల మేఘాలపై, నిరం తరం కళ్ళలో స్వప్నాల్ని ధరించి ఉంటాడు. రహస్య ఉద్యమాలు, చిన్న చిన్న పోరాటాలు, అజ్ఞాతవాసాలు, నిద్రలేనితనంతో రోడ్లపై అశాంతిగా తిరగటం, తనతో తాను నినదించుకుంటూ, కొత్త ప్రపం చపు పాటలు పాడుతూ, నరసింహం ఇప్పుడు, జననేత అయ్యాడు. అతని మరణం గురించి కవితలు అచ్చయినాయి. అతని విగ్రహాన్ని పెట్టడానికి ఏర్పాట్లు సిద్ధమయాయి. (నరసింహం ఈ కొత్త చరిత్రలో నా గురించిన ప్రస్తావన లేదు).

రాత్రిపూట, నా బెడ్‌రూమ్‌లో కూర్చుని, కిటికీలోంచి, బయ టకు చూస్తే, చీకట్ల మధ్య నుంచి, నాకు నరసింహం కనబడేవాడు. ఖననం కాని, అతని శరీరం, నిప్పులు వెదజల్లుకుంటూ, రోడ్డుపై సంచరించటం నేను చూశాను. అతని మరణపు వాసన నాకు

తెలుస్తూనే ఉంది. ఇప్పుడు నేను, హైదరాబాదు రోడ్డుపై పిచ్చిదానిలా తిరుగుతాను. ఆ రోడ్లపై నేను నడుస్తున్నప్పుడు, నా పక్కన అతని ఉనికిని నేను చూడగలుగుతున్నాను. హైదరాబాద్‌నంతా అతని మరణం, నల్లని చీకటి తెరలా కమ్మి వేసింది. రోడ్లకు దిగులు రంగును పూసింది. నేను, నరసింహం కలిసి తిరిగిన రోడ్లు, ఇప్పుడు శవాన్ని లోపల దాచుకున్న శవపేటికల్లా కనిపిస్తున్నాయి. నగరమంతా మరణించటం లాంటి ఒక అనుభవంలోకి వెళ్ళినట్లుగా అనిపిస్తుంది.

మూడోరోజు నరసింహం ఇంటికి వెళ్ళాను. ఇంటి బయట, వట్టిబోయిన గేదె నిశ్శబ్దంగా చూస్తుంది. దాని ముందున్న గడ్డిని నమిలే ప్రయత్నం చెయ్యటం లేదు. ఈనిన తన పిల్లలతో, పిల్లి ఒకటి, బరువు నడకలతో ఇంటిలో తిరుగుతుంది. ఇంటి బయట వరండాలో నాలుగు పావురాలు. అటు, ఇటు తిరుగుతున్నాయి. (నరసింహం పెంచుకునే పావురాలు) వాటి చుట్టూ గింజలు చల్లి ఉన్నాయి. ఇంట్లో వంట చేసుకోలేదు. ఎవరో కారేజీ పంపించారు. అయితే ఆ కారేజీ విప్పుకొని అన్నం తిన్న సూచనలేమీ లేవు. వాళ్ళమ్మ మంచంపై పడుకొని ఉంది. వెళ్ళి పక్కన కూర్చున్నాను. ఆమె నా తలపై చెయ్యి పెట్టి, నా జుట్టు నిమురుతూ "ఇంక ఇటు రాబోకు బిడ్డా," అంది. ఉలిక్కిపడ్డాను. బయట వరండాలోని పావురాలు, రెస్ట్‌లెస్‌లా, రెక్కలు టపటపలాడిస్తూ, అటూ ఇటూ ఎగురుతున్నాయి. (నరసింహం వాటికి నూర్జహాన్, ముంతాజ్ అంటూ మొఘల్ రాణుల పేర్లు పెట్టుకున్నాడు).

అర్ధగంట కూర్చున్నాక, "వస్తానత్తా!" ఆమెకు సెలవు చెప్పి బయటకు వచ్చాను. వరండాలో పావురాళ్ళు, రాతిగోడలకు తమ ముక్కులను టపటపా కొట్టుకుంటూ, వాటి ముక్కుల నిండా రక్తం. వాటిని ఒడిచిపట్టుకొని, సంచిలో వేసుకొన్నాను. ఆ సంచిని, నా స్కూటీకి తగిలించుకొని హైదరాబాద్ వీధులన్నీ తిరిగాను. ముందుగా





కోఠీ వెనుకనున్న ఇరుకైన గల్లీలో, జన సముద్రంలాంటి అబిడ్స్ ముందు కాసేపు ఆగాను. చాదర్‌ఘాట్ దగ్గర కాసేపు ఆగి, చివరకు చార్మినార్ ముందున్న విశాలమైన ప్రదేశం దగ్గర ఆగాను. ఆ విశాల మైన ప్రదేశంలో వందలాది పావురాళ్ళు నిర్భయంగా తిరుగు తున్నాయి. ఎవర్నీ పట్టించుకోనట్లుగా హైదరాబాద్ నగరం తమదే అన్నట్లుగా భరోసాతో. సంచిని తెరిచి నాలుగు పావురాల్ని వదిలేశాను. రెక్కలు విప్పుకొని, దీక్షగా తన్మయంగా చూస్తూ, గుంపు వైపు ఎగిరా యవి.

నేను, స్కూటీ పార్కుచేసి చార్మినార్ వైపు నడిచాను. చార్మి నార్ గోడపై మా యిద్దరి పేర్లు రాయడానికి నిర్ణయించుకొన్నాను.

*ఆదివారం వార్త, 17 జనవరి 2010*